క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుడిగా హరికృష్ణ నియామకం



రుద్రూర్: రుద్రూర్ మండల బీజేపీ అధ్యక్షుడిగా ఆలపాటి హరికృష్ణను పార్టీ అధిష్టానం నియమించింది. ఉపాధ్యక్షులుగా ఎంవీ కృష్ణం రా జు, బేగరి వినోద్ కుమార్, రేపల్లి సాయిప్రసాద్, బోజిగొండ అనిల్, ప్రధాన కార్యదర్శులుగా ఏముల గజేందర్, వడ్ల సాయినాథ్, మండల కార్యదర్శులుగా ఎర్రోళ్ల శంకర్, కొండలవాడి సాయిలు, జీలకర్ర విజయ్, అంకె రాజేష్, కోశాధికారిగా వి. రాంరాజ్ నియామకం చేసినట్టు మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు వెల్లడించారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నందిపేట్(ఆర్మూర్): ఉమ్మెడ గ్రామానికి చెందిన ఈర్ల నాగన్నకు రూ.26 వేలు, తల్వేద గ్రామానికి చెందిన సాకలి పద్మకు రూ.36 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ అందజేశారు. కాంగ్రెస్ నాయకులు దూడ వెంకటేష్, మురళి, నక్క భోజన్న, ఓంకార్, కాటికే మురళి, ఒడ్డే గంగాధర్, మన్నె సాగర్, గంగయ్య, గంగారెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు

ఎల్వోసీ అందజేత



బోధన్: ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన సయ్యద్ బురాన్ భార్య తస్లీం బేగం అనారోగ్యానికి గురికాగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్య పరీక్షలనంతరం తస్లీంబేగంకు మెదడులో నీరు చేరిందని చికిత్స కోసం రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అంత పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టే ఆర్థిక స్తోమ త తనకు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌తో మొరపెట్టుకున్నారు. ఆ యన స్పందించి ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శ న్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే చొరవ తీసుకుని సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2 లక్షల 50 వేలు మంజూరు చేయించారు. బుధవారం నిమ్స్‌లో పులి శ్రీనివాస్, బాధితుడికి కాపీని అందించారు.

ఐఐటీకి ఎంపిక

మాక్లూర్: మండల కేంద్రంలో పీఎంపీగా పని చేస్తున్న మామిళ్ల శ్రీనివాస్ రెడ్డి కుమారుడు ఐఐటీలో సీటు సాధించాడు. నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన మామిళ్ల శ్రీనివాస్ రెడ్డి, గంగామణి దంపతులు 30 ఏళ్ల క్రితం మాక్లూర్ గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. కుమారుడు ఐఐటీలో సీటు సాధించడంతో బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. మామిళ్ల నిఖిత్ రెడ్డి జాతీయ స్థాయిలో 5,683, జనరల్ ఈడబ్ల్యూఎస్ కోటాలో 613 ర్యాంక్ సాధించారు. మంచి పేరున్న కళాశాలలో సీటు వస్తుందని ఆశిస్తున్నట్లు వారు తెలిపారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను బుధవారం అందజేశారు. ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో నరేందర్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. బడులు ప్రారంభమైన మొదటి రోజు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో నూతనంగా ప్రవేశపెట్టిన ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రత్యేకాధికారిణి బి. శ్యామల తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు న్నాయని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్సెస్సీ హాల్ టికెట్, టెన్త్ మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, ఆరోగ్య సర్టిఫికెట్లు జతపర్చాలని వివరించారు.

పశువులకు టీకాలు



మాక్లూర్ : మదనపల్లిలో బుధవారం మండల పశు వైద్యాధికారులు కిరణ్ దేశ్‌పాండే, ఉమా సాహెర్ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. వర్షాకాలంలో పశువులకు సోకే దొబ్బవాపు వ్యాధి, గొర్రె, మేకలకు సోకే చిటుకు రోగానికి ముందస్తుగా ఈ టీకాలు వేస్తున్నట్లు పశువైద్యులు తెలిపారు. పశు వైద్య సిబ్బంది టీవీ వినీత, పుష్ప, సుధీర్, గంగాధర్, హమ్మద్ పాషా పాల్గొన్నారు.

వెలవెలబోతున్న క్రీడా ప్రాంగణాలు

- బోర్డుకే పరిమితం
- స్మార్ట్ ఫోన్లకు బానిసలవుతున్న యువకులు
- బాయిలర్ కోళ్లలాగా తయారవుతున్న బాలలు



గోవింద్‌పేట్‌లో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికి గత ప్రభుత్వం గ్రామ గ్రామాన ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. దీంతో యువత సాగు చేయని పొలాలను మైదానాలుగా గట్లనే బౌండరీలుగా చేసుకుని క్రికెట్ ఆడుతున్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల పేరుతో ఆర్భాటం చేసింది. విద్యార్థులు, యువత ఆడుకోవడానికి ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో పేరుకే క్రీడా ప్రాంగణాలుగా మిగిలిపోయాయి. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడానికి క్రీడా ప్రాంగణాల్లో కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటి క్రీడలకు సంబంధించిన ఎలాంటి కోర్టులు ఏర్పాటు చేయలేదు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ విద్యార్థులు మైదానాలు లేక ఎలాంటి క్రీడలకు నోచుకోవడం లేదు. ఇంటికి వచ్చిన తర్వాత అయినా ఆటలు ఆడుకోవడానికి ఎలాంటి మైదానాలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, యువత దిక్కుతోచక టీవీలు, స్మార్ట్‌ఫోన్లకు బానిసలై పోతున్నారు. వ్యాయామం లేక బాయిలర్ కోళ్లలా యువకులు తయారవుతున్నారు. క్రీడల ద్వారా పోటీతత్వం పెంచినపుడే ఎవరైనా వ్యసనాల నుంచి బయటపడే అవకాశం ఉంది. యువతను చిత్తు చేస్తున్న గంజాయి, మాదక ద్రవ్యాలపై ఇప్పటికే ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ప్రయోజనంలోకి తీసుకువస్తే వారిని సన్మార్గంలో నడిపించే లక్ష్యం నెరవేరుతుంది.

నేటి చిత్రం



మాక్లూర్: గొట్టిముక్కల, బొంకన్‌పల్లి గ్రామాల మధ్యలో గల బీటీ రోడ్డుపై గోతి ఏర్పడి రెండు నెలలు కావస్తోంది. కొన్ని సమయాల్లో గోతి ఉందని ఏర్పడక వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే గోతిని పూడ్చి సరి చేయాలి. – ప్రమోద్, బొంకన్‌పల్లి, మాక్లూర్

మాకు ఫొటో పంపండి
మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.
ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్: 99636 95349

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



రాయకూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

రెంజల్/రుద్రూర్(బోధన్): ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. బుధవారం రెంజల్ మండలం నీలా, రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ఆయన హాజరయ్యారు. రైతుల సమస్యలు తెలుసుకొని, దరఖాస్తులను పరిశీలించారు. భూ సమస్యలపై వచ్చిన అర్జీలను ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కారిస్తామని అర్జీదారులకు సూచించారు. రెంజల్ తహసీల్దార్, తహశీల్దార్ శ్రావణ్‌కుమార్, రుద్రూర్ తహసీల్దార్ తారాబాయి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా వినియోగం తగ్గించాలి



రైతులతో సమావేశమైన అధికారులు, శాస్త్రవేత్త

వర్ని(చందూర్): రైతులు పంట పొలాల్లో యూరియా వినియోగం తగ్గించాలని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ప్రశాంతి సూచించారు. బుధవారం చందూర్ మండలం కారేగాం తండాలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు సూచనలిచ్చారు. ప్రతి రైతు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. శాస్త్రవేత్త సాయి చరణ్, విస్తరణ అధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బడి బాటకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎంఈవో నాగయ్య



హాజరైన ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు

బోధన్: పాఠశాలల పున: ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ నెల 6 నుంచి నిర్వహించే ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమానికి సిద్ధం కావాలని బోధన్ ఎంఈవో నాగయ్య, హెచ్ఎంలకు ఆదేశించారు. గతం కంటే ఎక్కువగా విద్యార్థుల సంఖ్య నమోదు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఆఫీస్ మీటింగ్ హాల్‌లో పట్టణ, మండల స్థాయి మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఎంఈవో మాట్లాడారు. పాఠశాలల ప్రారంభమైన తొలి రోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించాలన్నారు. పాఠశాల మొత్తం శుభ్రం చేయించాలని సూచించారు. కాంప్లెక్స్ స్కూల్స్ హెచ్ఎంలు సూర్యకుమార్, రత్నాకర్, ఆరిఫుద్దీన్, సీఆర్పీలు పాల్గొన్నారు.

6న దివ్యాంగుల బడిబాట కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మార్కెట్ యార్డులో ఈ నెల 6న స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సొసైటీ వ్యవస్థాపకుడు, కార్యదర్శి సిద్దయ్య అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. మానసిక వికలాంగులకు, అంధులకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లలోపు పిల్లలు హాజరుకావాలన్నారు.



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న సిద్దయ్య

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



బోధన్‌టౌన్(బోధన్): బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. అవాంఛనీయ ఘటనలకు చోటు ఇవ్వవద్దని, పుకార్లు నమ్మవద్దని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, సీఐ, ఎస్సై తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాను నియంత్రించాలి



రెంజల్(బోధన్): బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రెంజల్ ఎస్సై చంద్రమోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు క్యాతం యోగేశ్ మాట్లాడుతూ.. గోవుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సంతోష్, యోగేశ్, ఒడ్డెన్న, అంజయ్య, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



సిద్దాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సాయిలు



నికాల్‌పూర్‌లో..

ఆర్మూర్, బోధన్, బాల్కొండ, బాన్సువాడ నియోజకవర్గాల్లో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. ఆయా సదస్సుల్లో రైతుల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లిలో 43, ఖానాపూర్‌లో 50, డొంకేశ్వర్ మండలం కోమటిపల్లిలో 30, నికాల్‌పూర్‌లో 66, వర్ని మండలం సిద్దాపూర్, కూనిపూర్, పైడిమల్, మల్లారం గ్రామాల్లో 66, వేల్పూర్ మండలం అమీనాపూర్‌లో 6, సాహెబ్‌పేట్‌లో 5 దరఖాస్తులు వచ్చాయి. – పెర్కిట్/వర్ని/వేల్పూర్/డొంకేశ్వర్

తొక్కిసలాట జరగకుండా టోకెన్లు



పెర్కెట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్లో రేషన్ బియ్యం పంపిణీలో తొక్కిసలాటను నివారించడానికి గంగాదేవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్ రెడ్డి లబ్ధిదారులకు బుధవారం టోకెన్లను అందజేశారు. ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్దకు బారులు తీరుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన వినోద్ రెడ్డి లబ్ధిదారులకు టోకెన్లు అందజేశారు. డీలర్ టోకెన్ల ప్రకారం బియ్యం పంపిణీ చేశారు.

రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటో పెట్టాలి

బోధన్‌టౌన్(బోధన్): ప్రతి రేషన్ దుకాణంలో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో పెట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పసులోటి గోపికిషన్ కోరారు. బుధవారం పట్టణంలోని రేషన్ దుకాణాలను సందర్శించారు. పేదలకు అందిస్తున్న మూడు నెలల బియ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతీ వ్యక్తికి 6 కిలోల బియ్యం ఇస్తే అందులో 5 కిలోలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని, ఒక కిలో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని గుర్తు చేశారు. నాయకులు రాజుల దేవి పవన్‌కుమార్, గౌతం, లింగం, మాసిని వినోద్, సాగర్ గౌడ్ తదితరులున్నారు.

అడుగుకో గుంత.. తీరేనా చింత ?



ముప్కాల్ శివారులో గుంతలమయంగా మారిన ముప్కాల్- మెండోరా రోడ్డు



మెండోరా మండల కేంద్ర శివారులో..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం నుంచి మెండోరా మండల కేంద్రం వరకు పెద్ద వాగు రోడ్డును దాటుతూ నిర్మించిన తారు రోడ్డు గుంతలమయంగా మారింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ రాజ్ అధికారులు ఈ రోడ్డును 2017లో వేశారు. తారు వేసిన మూడు రోజులకే మాజీ సీఎం కేసీఆర్ ఎస్సారెస్పీ పర్యటనకు వచ్చారు. ఈ సమయంలో ట్రాఫిక్ మళ్లింపు ఈ రోడ్డు గుండా చేశారు. పెద్ద పెద్ద వాహనాలు రావడంతో అప్పుడే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో వర్షపు నీరు నిండిపోయింది. రోడ్డు మరమ్మతుల కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.1.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాని పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. వర్షా కాలం సీజన్ ప్రారంభం కాక ముందే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలోనే చేపడుతాం..

ముప్కాల్- మెండోరా రోడ్డుకు త్వరలోనే మరమ్మతులు చేపడుతాం. ఇది వరకే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సీజన్‌కు ముందే మరమ్మతులు జరిగేలా చూస్తాం.

– షరీఫ్, పంచాయతీ రాజ్ ఏఈఈ, బాల్కొండ

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాష్ కుమార్

మాక్లూర్: వానాకాలంలో డెంగీ, చికెన్ గున్యా వంటి విష జ్వరాలు పెరిగే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, డెంగీపై అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నివారించవచ్చని డాక్టర్లు ప్రకాష్‌కుమార్, రవిశంకర్ పేర్కొన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో, డీఎంవో ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులకు కీటక జనిత వ్యాధుల నియంత్రణలో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు విష జ్వరాల నివారణకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మండల స్పెషల్ ఆఫీసర్ ముత్తెన్న, ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, హెచ్ఈవో ప్రవీణ్ రెడ్డి, సూపర్‌వైజర్లు ప్రభాకర్, సుధాకర్ పాల్గొన్నారు.

పొదల మాటున పొంచి ఉన్న ముప్పు



పాండు చెరువు అలుగు వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు, మూలమలుపు

బోధన్: పట్టణ బైపాస్ రోడ్డులో పాండు చెరువు అలుగు వద్ద కల్వర్టు ప్రమాదకరంగా తయారైంది. కల్వర్టుకు ప్రక్కన రెండు వైపులా భారీ గుంతలున్నాయి. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు, ద్విచక్రవాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఏమాత్రం ఆదమరిచినా భారీ వాహనాలు బోల్తా పడే అవకాశముంది. రాత్రివేళ అయితే అక్కడ దారిగా కూడా సరిగ్గా కనిపించదు. చాలా రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా కల్వర్టు గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. కల్వర్టును విస్తరించి రెండు వైపులా సీసీ సైడ్‌వాల్స్ నిర్మించాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో భారీ ప్రమాదాలు చోటు చేసుకునే పరిస్థితులున్నాయి. అధికారులు స్పందించి తాత్కాలికంగానైనా కల్వర్టు మరమ్మతులు చేపట్టి, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఈద్గా పరిశీలన

బోధన్‌టౌన్(బోధన్): బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణ శివారులోని ఈద్గాను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కమిషనర్ వెంకట నారాయణ పరిశీలించారు. ఈద్గా వద్ద మౌలిక వసతులు కల్పిస్తామని, శుభ్రం చేయిస్తామని చెప్పారు. కమిషనర్ వెంట తహసీల్దార్ విఠల్, సీఐ వెంకట నారాయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మోయినొద్దీన్, శరత్ రెడ్డి తదితరులున్నారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)
స్క్రీన్-3 కరాటే కిడ్ లెజెండ్స్-11.20, 5.10.35
ఖలేజా-1.35, భైరవం-7.25
స్క్రీన్-4 భైరవం-10.25, 4.20, 10.15
సింగిల్-1.35, 7.30

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,500	వెండి(కిలో)	1,03,500
22 క్యారెట్స్	90,002		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

నిరుపేదకు హెల్పింగ్ హాండ్స్ చేయూత

రుద్రూర్: అంబం(ఆర్)లో ఇటీవల కురిసిన వర్షానికి నిరుపేద గూండ్ల పాపవ్వ ఇంటి గోడ కూలిపోవడంతో నిరాశ్రయురాలైంది. ఈ సమస్యను హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గుర్తించి బుధవారం పరిష్కరించారు. గోడ కూలిన ప్రాంతంలో రేకులను బిగించారు. వృద్ధురాలికి నీడ కల్పించిన హెల్పింగ్ హాండ్స్ సభ్యులను స్థానికులు అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



నవీపేట: అబ్బాపూర్(బి) గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు అంబేడ్కర్ గొప్పతనాన్ని వివరించారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కమిటీ ప్రతినిధులు సుధాకర్, నీరడి ఈశ్వర్, మచ్చ దేవేందర్, పాండు, శంకర్, గంగాధర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రికవరీ సెల్‌ఫోన్ల అందజేత

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల పోగొట్టుకున్న 2 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి సీఐ వెంకట నారాయణ యజమానులకు బుధవారం అందజేశారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి యజమానులకు అందించామని సీఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులపై ఆందోళన వద్దు

బాల్కొండ: ఇందిరమ్మ ఇళ్ల బిల్లులపై ఆందోళన వద్దని ముప్కాల్ ఎంపీడీవో ఆనంద్ నరేశ్ అన్నారు. బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో పలువురి లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఖాతాలోకి వస్తాయన్నారు. లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలను ప్రారంభించాలన్నారు. జీపీ కార్యదర్శి మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా విగ్రహాల ఊరేగింపు



రెంజల్(బోధన్): సాటాపూర్‌లో శ్రీరామాలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు బుధవారం గ్రామంలో విగ్రహాలను ఊరేగించారు. మహిళలు మంగళహారతులు పట్టుకుని ఊరేగింపులు పాల్గొనగా గ్రామస్తులు, యువకులు డప్పు వాయిద్యాలతో భజనలు చేస్తు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.